బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 14 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

మహా కుంభమేళాలో తొలిసారి ఏఐ, చాట్‌బాట్ సేవలు

- ప్రధాని మోడీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్‌లో శుక్రవారం పర్యటించారు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా జరగనున్న క్రమంలో రూ.5,500 కోట్ల విలువైన కుంభమేళాకు సంబంధించి పలు ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రసిద్ధ అక్షయ వట వృక్షం వద్ద పూజలు నిర్వహించారు. హనుమాన్ మందిర్, సరస్వతి కూప్‌ను సందర్శించారు. అనంతరం ప్రధాని ప్రసంగిస్తూ ఈ ఉత్సవాల్లో తొలిసారి ఏఐ, చాట్‌బాట్ సేవలు వినియోగించుకోబోతున్నట్లు వెల్లడించారు. దేశప్రజలంతా ఈ మహా కుంభమేళాకు తరలి రావాలంటూ మోదీ పిలుపునిచ్చారు. ఈ వేడుకను ప్రపంచ దేశాలు చర్చించుకునే

మిగితా 3వ పేజీలో

'పుష్ప' అరెస్ట్

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు
- మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- విడుదల ప్రక్రియ ఆలస్యం
- రాత్రిచంచల్‌గూడ జైల్లోనే బన్నీ..!

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట ఘటన కేసులో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 4న హైదరాబాద్ ముషీరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 మూవీ ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. మృతురాలు భర్త భాస్కర్ ఫిర్యాదు మేరకు నటుడు అల్లు అర్జున్, సినిమా యూనిట్‌తో పాటు, సంధ్య థియేటర్ యాజమాన్యంపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో థియేటర్ యాజమాన్యంతోపాటు ఇద్దరు మేనేజర్లను ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తాజాగా ఏ11 నిందితుడిగా ఉన్న అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్టు చేస్తున్న విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు, సినీప్రముఖులు, బంధుమిత్రులతోపాటు తదితరులు భారీగా తరలి వచ్చారు.

ఉదయం జూబ్లీహిల్స్‌లోని హీరో అల్లు అర్జున్ నివాసానికి వెళ్ళిన చిక్కడపల్లి పోలీసులు 11:45గంటలకు అరెస్టు చేశారు. అక్కడి నుంచి భారీ పోలీస్ భద్రత మధ్య అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్ వద్దకు అభిమానులు, ప్రముఖ నిర్మాత దిల్ రాజు, అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి, అల్లు అరవింద్, పలువురు దర్శకులు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అల్లు అర్జున్‌పై 105, 118(1) రెడ్ విత్ 3/5 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి, గాంధీ ఆస్పత్రిలో వైద్యపరీక్షల అనంతరం నాంపల్లి కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. తొక్కిసలాటకు ప్రత్యేక్షంగా, పరోక్షంగా ఆయనకు ఎలాంటి సంబంధం లేదని, కేసును కొట్టివేయాలంటూ అల్లు అర్జున్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. దీనిపై పోలీసులు సైతం బలంగా వాదనలు వినిపించారు. ప్రిమియర్ షోకు మాత్రమే అనుమతులు ఇచ్చామని, హీరో, హీరోయిన్‌ను రావద్దని థియేటర్ యజమానులకు లేఖ రాశామని, అయినా పోలీసుల అనుమతి లేకుండా దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర ర్యాలీతో థియేటర్ దగ్గరకు వచ్చారని, ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగిందని పోలీసులు కోర్టుకు తెలిపారు.

మిగితా 3వ పేజీలో

పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంటును విడుదల చేయండి

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

నాలుగేళ్లకు కలిపి పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంటును వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో పార్లమెంట్‌లోని ఆమె ఛాంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నుంచి రావల్సిన గ్రాంటుపై చర్చించారు. పునర్విభజన చట్టంలో తెలంగాణలోని తొమ్మిది జిల్లాలకు ఏటా రూ.450 కోట్ల చొప్పున గ్రాంటు విడుదలకు అంగీకరించారని ఆయన గుర్తు చేశారు. 2019-20, 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల గ్రాంటును ఇప్పటి వరకు విడుదల చేయలేదని తెలిపారు. నాలుగేళ్లకు కలిపి పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంటును వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర పునర్విభజన తర్వాత హైదరాబాద్‌లోని హైకోర్టు, రాజ్ భవన్, లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, జ్యుడిషియల్ అకాడమీ సహా ఇతర ఉమ్మడి సంస్థల నిర్వహణను తెలంగాణ ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయా సంస్థల విభజన పూర్తయ్యే వరకు నిర్వహణకు అయిన రూ.703.43 కోట్లను తెలంగాణ ప్రభుత్వమే భరించిందని.. అందులో ఆంధ్రప్రదేశ్ వాటా రూ.408.49 కోట్లను తెలంగాణకు చెల్లించాల్సి ఉందని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఆ మొత్తం చెల్లింపునకు ఆంధ్రప్రదేశ్ సమ్మతి తెలిపిందని, కేంద్ర హోం శాఖ సైతం ఆ మొత్తం తెలంగాణకు చెల్లించాలని ఏపీకి లేఖలు రాసిందని సీఎం వివరించారు. అయినా ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ఆ మొత్తాన్ని తెలంగాణకు చెల్లించలేదని%%%ఆ రూ.408.49 కోట్లను వడ్డీతో సహా తెలంగాణకు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని నిర్మలా సీతారామన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుంచి ఏకపక్షంగా రూ.2,547.07 కోట్ల రికవరీకి కేంద్రం ఏకపక్షంగా ఆదేశాలు ఇచ్చిందని నిర్మలా సీతారామన్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీవ్ర నిరసన తెలిపినా పట్టించుకోలేదని, ఈ విషయంపై మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులన్నీ 2014-15లో కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కేంద్ర ప్రభుత్వం కేటాయించిన విషయాన్ని నిర్మలా సీతారామన్‌కు రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పునర్విభజన చట్టంలోని జనాభా ప్రాతిపదికన ఆ మొత్తంలో ఏపీ నుంచి తెలంగాణకు రూ.495.20 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు.

2030 నాటికి 20గిగా వాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తే లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విద్యుత్ పొదుపు క్యాలెండర్ ఆవిష్కరణ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గ్రీన్ పవర్ విద్యుత్ రంగం దిశగా రాష్ట్రం దృఢ సంకల్పంతో పనిచేస్తుందని డిప్యుటీ సీఎం భట్టి అన్నారు. 2030 నాటికి 20గిగా వాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నదని వెల్లడించారు. ఈ నెల 14 - 20 వరకు నిర్వహించనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ పొదుపు వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలంగాణ రాష్ట్ర పునరుత్పత్తి విద్యుత్ అభివృద్ధి సంస్థ అధికారులు రూపొందించిన 2025 విద్యుత్ పొదుపు క్యాలెండర్‌ను శుక్రవారం ప్రజా భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 2030 నాటికి 20 గిగావాట్స్ పునరుత్పత్తి విద్యుత్, 2035 నాటికి 40గిగావాట్స్ స్థాపన లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తున్నదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీ-జీ రెడ్కో జీఎం గుప్రసాద్, డిప్యూటీ- జనరల్ మేనేజర్ వెంకటరమణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

సినిమా చూసి వెళ్లిపోతే అయిపోయేది : సీఎం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చి సినిమా చూసి వెళ్తే అయిపోయిదే.. కానీ ఆయన కారులోంచి బయటకు వచ్చి హంగామా చేశాడు.. దాంతో అభిమానులు భారీ ఎగబడ్డారు. జనాన్ని కంట్రోల్ చేయలేక తొక్కిసలాట జరిగింది. తొక్కిసలాటలో ఓ మహిళా ప్రాణాలు కోల్పోగా.. ఆమె కుమారుడు ఇంకా ఐసీయూలో ఉన్నాడు" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అల్లు అర్జున్ అరెస్ట్, బెయిల్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీలో 'ఆజ్‌తక్' నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న ఆయన అల్లు అర్జున్ అరెస్టు ఘటనపై మాట్లాడారు.

దేశంలో సాధారణ పౌరుడి దగ్గరి నుంచి ప్రధాని వరకూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అందరికీ సమానంగా వర్తిస్తుందన్నారు. 'పుష్ప-2' విడుదల సందర్భంగా బెనిఫిట్ షోకే కాకుండా టికెట్ ధరలు పెంచుకోవడానికీ తామే అనుమతి ఇచ్చామన్నారు. అయితే బెనిఫిట్ షోకు అనుమతి లేకుండా అల్లు అర్జున్ అక్కడకు వచ్చారని అన్నారు. హంగామా చేయకుండా వెళ్తే ఇంత గొడవయ్యేది కాదని.. కారు నుంచి బయటకొచ్చి చేతులూపుతూ ర్యాలీలా అభివాదం చేశారని, అప్పుడే అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తగా, అది తొక్కిసలాటకు దారితీసిందని చెప్పారు. దాని ఫలితమే ఓ మహిళ మృతి, మరో చిన్నారి ఆసుపత్రిలో ఉన్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. సినిమా స్టారా? పొలిటికల్ స్టారా? అనేది మా ప్రభుత్వం చూడదు, నేరం ఎవరు చేశారనే దాన్ని మాత్రమే చూస్తాం, ఘటనలో ఓ మహిళ చనిపోయింది.. దీనికి బాధ్యులు ఎవరు?, సినిమా చూడాలనుకుంటే స్టూడియోలో స్పెషల్ షో వేసుకుని చూడవచ్చు, ప్రేక్షకులతో కలిసి చూడాలనుకుంటే ముందుగా పోలీసులకు చెప్పాలి అని అన్నారు.

అల్లు అర్జున్ తనను చిన్నప్పట్నుంచీ తెలుసని, కావాలని ఆయన్ను ఎందుకు అరెస్టు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అల్లు అర్జున్ మేనమామ చిరంజీవి కాంగ్రెస్ నేత కాగా, ఆయన సొంతమామ చంద్రశేఖర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లోనే ఉన్నారని, అల్లు అర్జున్ సతీమణి కుటుంబం తనకు బంధువులను ముఖ్యమంత్రి చెప్పారు. లా అండ్ ఆర్డర్ ప్రకారమే పోలీసులు నడుచుకుంటారని స్పష్టం చేశారు. ఒకవేళ అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయకపోతే సెలబ్రెటి అని.. లేదా సీఎం చుట్టాలు కావడంతోనే అరెస్ట్ చేయలేదని అంటారు.. అరెస్ట్ చేస్తేనేమో ఎందుకు చేశారంటున్నారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేస్తే అడుగుతున్నారు.. మరీ చనిపోయిన మహిళా.. ఆమె కుమారుడి గురించి ఎవరూ అడగటం లేదు.. బాధిత కుటుంబానికి జవాబుదారీ ఎవరని సీఎం ప్రశ్నించారు. సినిమా వాళ్లు పైసలు పెట్టారు.. లాభాలు సంపాదించారు.. వాళ్లు దేశం కోసం చేసిందేమైనా ఉందా అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. హోంశాఖ నా దగ్గరే ఉందని.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు తెలుసని అన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని క్లారిటీ ఇచ్చారు. అలాగే తనకు తానే ఓ పెద్ద స్టార్‌ను అని.. తనకంటూ అభిమానులు ఉండాలి కానీ, తానెవరికీ అభిమానిని కాదని ప్రకటించారు.

కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలి

- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

వివరాలు 3వ పేజీలో

మరో ఎన్‌కౌంటర్..

- ఇద్దరు మావోయిస్టుల మృతి
- ఛత్తీస్‌గఢ్ నెంద్ర అటవీ ప్రాంతంలో సంఘటన

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో శుక్రవారం మరో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. కాగా, గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. మావోయిస్టుల కోసం ఈ నెల పదో తేదీ నుంచి భద్రతా బలగాలు, డీఆర్జీ, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ జవాన్లు అడవులను జల్లెడ పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి మావోయిస్టులు తారాసు పడ్డారు. దీంతో వారి మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్లు, సంఘటన స్థలం నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారి జితేంద్ర యాదవ్ తెలిపారు. ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఎక్సైజ్ శాఖ అభివృద్ధికి కలిసి పని చేయాలి

- ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- కీలక శాఖలపై మంత్రి సమీక్ష
- సమీక్షలో పాల్గన్న ప్రిన్సిపల్ సెకట్రరీ ఎస్ఏఎం రిజ్వీ, ఎక్సైజ్ శాఖ డెరెక్టర్ చెవ్వూరు హరి కిరణ్ ..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఎక్సైజ్‌శాఖ అభివృద్ధి కోసం సమీష్టిగా అధికారులు కలిసి పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని తెలంగాణ ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు సూచించారు. శుక్రవారం అబ్కారీ భవన్‌లోని సమావేశ మందిరంలో కీలక శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. సమీక్షలో అబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావు తోపాటు ప్రిన్సిపల్ సెకట్రరీ ఎస్ఏఎం రిజ్వీ, ఎక్సైజ్‌శాఖ డ్కెరెక్టర్ చెవ్వూరు హరి కిరణ్‌లు ఓ ఎస్ డి రాజేందర్ ఉన్నారు. ఉద్యోగుల ప్రమోషన్లు, బ దిలీలు ఇతర అంశాలపై ఎక్సైజ్ అడిషన్ కమిషనర్ అజయ్ రావుతోను, ఐఎంఎల్ సెల్స్ వ్యవహారాలపై జాయింట్ కమిషనర్ హెడ్‌క్వార్టర్స్ కేఏబీ శాస్త్రితోను, మద్యం తయారీ కంపెనీల వ్యవహారాలపై జాయింట్ కమిషనర్ డిస్టలరీస్, మద్యం అమ్మకాలు, మద్యం నిల్వలపై బెవరీస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్ర హం, ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ పురోగతిపై జాయింట్ కమిషనర్ ప్రణవీలతో విడివిడిగా సమావేశయ్యారు.

సరస్వతీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయండి

- భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడండి
- సరస్వతీ పుష్కరాల రివ్యూ మీటింగులో అధికారులకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఈ పుష్కరాలకు పక్క మన రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్ర భక్తులు కూడా వస్తారని, అందుచేత ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సరస్వతీ నదికి వచ్చే ఏడాది(2025లో) పుష్కరాలు రానున్న నేపథ్యంలో, పుష్కరాల నిర్వహణకు అధికారులు అంచనా నివేదికలు సిద్ధం చేయాలని ఆమె పేర్కొన్నారు. సరస్వతీ పుష్కరాల నిర్వహణపై దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, సమాచార, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులతో మంత్రి కొండా సురేఖ శుక్రవారం తెలంగాణ సచివాలయంలోని తన పేషీలో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ఆలయ చరిత్ర ప్రకారం, 'గురు' (బృహస్పతి) 'మిథున' (మిథునం) రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు నిర్వహిస్తామని అధికారులు చెప్పగా, పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులను పలు వివరాలు ఆమె అధికారులను అడిగారు. గతంలో సరస్వతీ పుష్కరాలకు దాదాపు 30 వేల మంది భక్తులు పుష్కర స్నానం చేశారని... ఈసారి 50 వేల మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నామని మంత్రికి వివరించారు. ఆ మేరకు ఏర్పాట్లను చేయాలని ప్రణాళికలు రచిస్తున్నట్టు వెల్లడించారు. అయితే, చిన్న పిల్లలు, స్త్రీలు, వృద్ధులు ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారని మంత్రి సురేఖ ప్రత్యేకంగా అడిగారు. వారికి ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారని ప్రశ్నించారు. మే నెలలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులపై అధికారులకు

మిగితా 3వ పేజీలో

ఇందిరమ్మ ఇండ్లకు స్పెషల్ కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇండ్లకు ప్రజాపాలనలో దరఖాస్తు చేయనివారు స్పెషల్ కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూపాయలు ఇస్తామని పొంగులేటి చెప్పారు.ఖమ్మం జిల్లా కూసుమంచి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు."పేదవారు కన్న కల ఇందిరమ్మ ఇళ్లు. ప్రతి ఇంటికి ప్రభుత్వ అధికారులు వెళ్లి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేయని వారు స్పెషల్ కౌంటర్ లో దరఖాస్తు చేసుకోవచ్చు. 4.50 లక్షల ఇళ్లు రాష్ట్ర వ్యాప్తంగా ఇస్తున్నాం. 80 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం అభ్యర్థించారు.

ఎవరైతే సొంత స్థలంలో ఉంటారో వారి ఇంటి ఫొటో తీసి యాప్ లో నమోదు చేస్తాం. ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూపాయలు ఇస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా 580 మోడల్ హౌస్‌లు సంక్రాంతి నాటికి కూసుమంచి లో మోడల్ హౌజ్ నిర్మాణం పూర్తి అవుతుంది. గత ప్రభుత్వ పాలనలో కాంట్రాక్టర్లకు ఇళ్లు ఇస్తే కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎవరు ఇళ్లు వారే నిర్మించుకునే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తిస్తున్నారు. దరఖాస్తు చేసిన వారి కుటుంబ సభ్యులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చు" అని పొంగులేటి తెలిపారు.

బతుకమ్మను అవమానించిన మంత్రులపై చర్యలు తీసుకోండి..

- ఎమ్మెల్సీ కవిత

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బతుకమ్మని అవమానించేలా మాట్లాడిన మంత్రులపై ఏం చర్యలు తీసుకుంటారని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మను మాయచేసిన విషయంపై తాము ప్రశ్నిస్తే పలువురు మంత్రులు ఏకంగా బతుకమ్మనే అవమానిస్తూ మాట్లాడారని అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత నేడు మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ ఎందుకని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారని, అయితే ఇందిరాగాంధీ,

మిగితా 3వ పేజీలో

గ్రూప్ 2 పరీక్షలకు సర్వం సిద్ధం...

- జిల్లా లో 26 కేంద్రాలు.. 7163 మంది అభ్యర్థులు..
- అధికారులు.. సిబ్బందికి శిక్షణ పూర్తి..

ఫైల్‌ఫోటో

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.జిల్లాలో గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడలో కలిపి మొత్తం 26 కేంద్రాలు టీజీపీఎస్సి ఏర్పాటు చేసింది. పరీక్షల విధుల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే అభ్యర్థుల హాల్ టికెట్లు వెబ్ సైటులో అందుబాటులో ఉంచింది. టీజీపీఎస్సి ఆధ్వర్యంలో గ్రూప్-2 నిర్వహణకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నేతృత్వంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇప్పటికే శిక్షణ అందించారు.

ఏర్పాట్లు పూర్తి..

టీజీపీఎస్సి ఆధ్వర్యంలో గ్రూప్-2 నిర్వహణకు అధికారులు జిల్లా వ్యాప్తంగా మొత్తం 26 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటిలో కావాల్సిన సౌకర్యాలు సమకూర్చారు. ఈ పరీక్షకు జిల్లా నుంచి మొత్తం 7163 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరిలో 106 మంది దివ్యాంగులు ఉన్నారు. అలాగే డిపార్ట్మెంటల్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్లు, అబ్జర్వర్లు 26 చొప్పున నియమించారు.

ఇవీ కేంద్రాలు..

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తంగళ్ళపల్లి, శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ తంగళ్ళపల్లి, సెస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గీతానగర్, సిరిసిల్ల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గీతానగర్, సిరిసిల్ల, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ పత్తిపాక వీధి సిరిసిల్ల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యానగర్, సిరిసిల్ల, శ్రీ చైతన్య స్కూల్, భావనారుషి నగర్ సిరిసిల్ల, నారాయణ హై స్కూల్ విద్యానగర్ సిరిసిల్ల, కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాయ్స్) శివనగర్ సిరిసిల్ల, ప్రభుత్వ జూనియర్ కళాశాల అంబేద్కర్ చౌక్ దగ్గర సిరిసిల్ల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకంపేట సిరిసిల్ల, శ్రీ శివాణి డిగ్రీ కళాశాల సర్దార్ నగర్ సిరిసిల్ల, సాయి శ్రీ జూనియర్ కళాశాల ఓల్డ్ బస్సు స్టాండ్ సిరిసిల్ల, అయ్యప్ప డిగ్రీ కళాశాల అనంత నగర్ సిరిసిల్ల, వికాస్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల సిరిసిల్ల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెహ్రూ నగర్ సిరిసిల్ల, మహతి డిగ్రీ కళాశాల వాసవి నగర్ సిరిసిల్ల, ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్ సిరిసిల్ల, శ్రీ కృష్ణ వేణి టాలెంట్ స్కూల్ మెహెర్ నగర్ సిరిసిల్ల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారం మండలం వేములవాడ, ఎస్ఆర్ఆర్ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అగ్రహారం మండలం వేములవాడ, ధార్మిక డిగ్రీ కళాశాల మల్లారం రోడ్ వేములవాడ, వైష్ణవి డిగ్రీ కళాశాల కోరుట్ల రోడ్ వేములవాడ, గౌతం మోడల్ స్కూల్ వేములవాడ, వాగ్దేవి డిగ్రీ కళాశాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా వేములవాడ, వివేకానంద జూనియర్ కళాశాల మల్లారం రోడ్ వేములవాడలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

అభ్యర్థులకు సూచనలు..

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్ లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్ లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుంది. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తారు. దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరికి అనుమతి లేదు .

అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ వెంట బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫోటోతో కూడిన హాల్ టికెట్, ప్రభుత్వం చేజారి చేసిన ఒరిజినల్ ఫోటో ఐడి కార్డ్ తీసుకుని రావాలి. హాల్ టికెట్ పై పాస్పోర్ట్ సైజ్ ఫోటో ముద్రించి తీసుకెళ్ళాలి. ఒకే హాల్ టికెట్ ను పరీక్ష మొత్తం వినియోగించాలి. హాల్ టికెట్ లో ఫోటో సరిగ్గా లేకపోతే అభ్యర్థి 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపల్ సంతకంతో తీసుకువచ్చి పరీక్షా హాల్లో ఇన్విజిలేటర్ కు అప్పగించాలి. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందు వచ్చి చూసుకోవాలి. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్, సెల్ ఫోన్, పెన్ డ్రైవ్ ,బ్లూ టూత్ డివైసెస్, జువెలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ మొదలగు సామాగ్రి తీసుకుని రావడానికి వీల్లేదు.చెప్పులు మాత్రమే వేసుకుని రావాలి. షుజ్ వేసుకోవద్దు. సెల్ఫోన్ బ్లూటూత్ ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అభ్యర్థులు తీసుకువచ్చినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్ళరాదు. బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ వ్యాలీడ్ కాదు. బయోమెట్రిక్ విధానం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ టాటూ వంటివి పెట్టుకోవద్దు. ప్రతి పేపర్ సమయంలో అభ్యర్థి ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్ టికెట్ పై సంతకం పెట్టాలి. మోడల్ ఓ.ఎం.ఆర్ షీట్ల ను వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సరిగ్గా బబుల్స్ చేయడం ప్రాక్టీస్ చేయాలి. ఓ.ఎం.ఆర్ షీట్ ను సరిగా చెక్ చేసుకోవాలి. పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్షా హాల్ ను విడిచి వెళ్లడానికి వీలులేదు.

గంట ముందే చేరుకోవాలి..

గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు వారికి కేటాయించిన కేంద్రానికి నిర్దేశిత సమయానికంటే గంట ముందే చేరుకోవాలి. టీజీ పీఎస్ సి నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఇప్పటికే సౌకర్యాలు కల్పించాము.

– సందీప్ కుమార్ ఝా, కలెక్టర్

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు..

బలగం టీవీ, గంభీరావుపేట

అనుమతులు లేకుండా, అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గంభీ రావుపేట మండలం నర్మాల గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని,నాయిని పర్శరాములు, గొర్రె కిషోర్ ల పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

17న సఫాయి కార్మికుల చలో హైదరాబాద్

-జీవో 51 సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి..

-యూనియన్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు నర్సయ్య , గణేష్

బలగం టీవీ , సిరిసిల్ల

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి,వేతనాలు పెంచాలని, జీవో 51 సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పాత కేటగిరీ కొనసాగించి జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ డిసెంబర్ 17 న రాష్ట్ర పిలుపులో భాగంగా చలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహా ధర్నాకు పిలుపు నివ్వడం జరిగిందని యూనియన్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు మల్యాల నర్సయ్య , అన్నల్ దాస్ గణేష్ అన్నారు.తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో డిశంబర్ 17న జరుగుతున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్ళేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో డిపిఓకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు మల్యాల నర్సయ్య , అన్నల్ దాస్ గణేష్ లు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ కార్మికులను మల్టీపర్పస్ పేరుతో గత ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. కనీస వేతనం చెల్లించకుండా పీఆర్సీలో చేర్చకుండా శ్రమ దోపిడీకి గురిచేశారని,2023 లో సమ్మె సందర్భంగా అప్పటి కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కనీస వేతనం 26 వేలు ఇస్తామని పది లక్షల ఇన్సురెన్స్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు.నిత్యం మురుగులో పనిచేస్తారు, అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి,ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పది లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం కార్మికుని కుటుంబానికి అందిస్తాం అని, వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి పెండింగ్ లేకుండా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతి నెల ఒకటో తారీఖు వేతనాలు అందిస్తామని హామీ ఇచ్చారు అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం గడిచినదని, ఎన్ని సార్లు వినతిపత్రాలు అందించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగిందిఅని అన్నారు.ఈనెల 17 వ తేదీన ఇందిరా పార్క్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లాలోని 12 మండలాల నుండి పెద్ద ఎత్తున కార్మికులు హైదరాబాద్ కి తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ ఇల్లంతకుంట మండల అధ్యక్షులు వర్కోలు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

నిర్దేశిత ఆన్‌లైన్ రుసుముతో కూడిన ద్విచక్ర వాహన లైసెన్స్ మేళా

- ఎస్పీ అఖిల్ మహాజన్

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో డ్రైవింగ్ వచ్చి లైసెన్స్ లేని యువతీ యువకుల కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్దేశిత ఆన్లైన్ రుసుముతో ద్విచక్ర వాహన లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ చేసే వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటుగా ఇన్సూరెన్స్ చాలా ముఖ్యం అని, దానికోసం జిల్లా పరిధిలోని డ్రైవింగ్ వచ్చి లైసెన్స్ లేని వారి కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్దేశిత ఆన్లైన్ రుసుముతో ద్విచక్ర వాహన లైసెన్స్ మేళ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ వచ్చి లైసెన్స్ లేని ఆసక్తి గల 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఈ నెల డిసెంబర్ 19 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు టెస్ట్ మేమోతో పాటు ఆధార్ కార్డు తో మీ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో పేరు నమోదు చేసుకోవాలని,పెరు నమోదు చేసుకున్న వారికి డ్రైవింగ్ టెస్ట్ లు నిర్వహించి,అందులో అర్హత సాధించిన వారికి తదనంతరం లైసెన్స్ లు జారిచేయడం జరుగుతుందన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

-టీటీయూ జిల్లా అధ్యక్షుడు కొండికొప్పుల రవి

బలగం టీవీ , సిరిసిల్ల :

సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పే స్కేల్ ను వెంటనే ప్రకటించాలని టిటియు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కొండికొప్పుల రవి అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె శిబిరాన్ని సందర్శించి టిటియు రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ సంపూర్ణ మద్దతును తెలియజేశారు.ఈ సందర్భంగా కొండికొప్పుల రవి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు అయిన పే స్కేల్, జీవిత భీమా , హెల్త్ కార్డులు, సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగులకు ఇతర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు ప్రభుత్వం వెంటనే ప్రకటించి జీవితాలలో ఆనందాలు, వెలుగులు నింపాలని అన్నారుసమగ్ర శిక్ష ఉద్యోగులు చాలీచాలని వేతనంతో అత్యంత దుర్భర పరిస్థితులలో జీవనం గడుపుతున్నారని, వారికి పే స్కేల్ ప్రకటించి అందిస్తే,ఆనందంగా వారి వృత్తి నిర్వహణలో ప్రభుత్వానికి, ఇటు ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ కార్యనిర్వహణలో అంకితభావంతో పాల్గొంటారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో టిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తడుకల సురేష్, చిరంజీవి పాల్గొన్నారు.

'కామన్ డైట్'ను విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

బలగం టీవీ, సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కే.జీ.బీ.వి , మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ అమలు కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పిలుపు నిచ్చారు.శనివారం కామన్ డైట్ మెనూ అమలు పై ఆయా విద్యాలయాల బాధ్యులు, ఇన్చార్జిలతో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ డిసెంబర్ 14న ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ మెనూ కార్యక్రమం ప్రారంభోత్సవము ఉంటుందని తెలిపారు. కామన్ డైట్ ప్లాన్ పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని సూచించారు. హాస్టల్స్ లో కామన్ డైట్ వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి హాస్టల్ లో ఒకే రకమైన ఆహారం విద్యార్థులకు అందించడం జరుగుతుందని అన్నారు. కిచెన్ అండ్ డైనింగ్ ఎరియా నిర్వహణ మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు . శనివారం ఉదయం 11 గంటలకు విఐపి రెసిడెన్షియల్ పాఠశాలలకు చేరుకుంటారని, 11 నుంచి 12 గంటల వరకు పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారని, 12 నుంచి 12.30 గంటల వరకు పిల్లలతో ఇంటరాక్షన్, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. అనంతరం కామన్ డైట్ ప్లాన్ సంబంధించిన హాండ్ బుక్ ముఖ్య అతిథి చే ఆవిష్కరించి ప్రసంగిస్తారని, అనంతరం 1 గంటలకు ముఖ్య అతిథి, పిల్లలు వారి తల్లిదండ్రులతో పాటు భోజనం చేస్తారని తెలిపారు.

మానాలలో హాజరు కానున్న విప్..

రుద్రంగి మండలం మానాలలోని టీజీ టీడబ్ల్యూ ఆర్ఎస్ (గర్ల్స్) విద్యాలయంలో చేపట్టే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరు కానున్నారు. అలాగే తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని విద్యాలయంలో చేపట్టనున్న కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ దుమాల ఎల్లారెడ్డిపేటలో చేపట్టనున్న కార్యక్రమానికి ఎస్పీ అఖిల్ మహాజన్, టీజీఎస్డబ్ల్యూ ఆర్ఎస్ (గర్ల్స్) చిన్న బోనాలలో నిర్వహించనున్న కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆయా విద్యాలయాల్లో చేపట్టనున్న కార్యక్రమాలకు మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆర్డీవోలు, ఆయా శాఖల జిల్లా అధికారులు హాజరు కానున్నారని తెలిపారు. శనివారం నాడు కామన్ డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉన్నందున ఆ రోజు నాన్ వెజ్ ఆదివారం మెనూ తయారు చేయాలని సూచించారు. గతంలో ఉన్న డైట్ చార్జీలు 8 సంవత్సరాల తర్వాత 40 శాతం ప్రస్తుత ప్రభుత్వం పెంచిందని, కాస్మెటిక్ చార్జీలను 16 సంవత్సరాల తర్వాత 200 శాతం పెంచిందని, పాఠశాలలో చదివి విద్యార్థుల ఎదుగుదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తుందనే సందేశం ముఖ్య అతిథి మాట్లాడేలా చూడాలన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం గురించి తల్లిదండ్రులకు కామన్ డైట్ లాంచ్ సందర్భంగా తెలియజేయాలని పేర్కొన్నారు. రాష్ట్రం మొత్తం మీద ఒకే డైట్ ప్లాన్ అమలు అవుతుందని, పిల్లలకు పౌష్టిక, రుచికరమైన ఆహారం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పాఠశాలలకు సరుకులు ఎలా వస్తున్నాయి? కిచెన్ లో ఎలా భద్రపరచాలి? విద్యార్థులకు రుచికరమైన ఆహారం ఆదిత్య ఎందుకు తీసుకోవాల్సిన చర్యలు అంశాల పై సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కిచెన్, డైనింగ్ ఏరియా లను శుభ్రం చేయాలని, ఆ ప్రాంతాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రమేష్ బాబుది లా మేకర్ చరిత్ర కాదు..లా బ్రేకర్ చరిత్ర...

- రమేష్ బాబు ప్రజలను మోసం చేసి అడ్డంగా దొరికిపోయిండు..
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ తీసిన రోజే కోర్టు తీర్పు రావడం ఆనందంగా ఉంది..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

బలగం టీవి, వేములవాడ

ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడ్డాను అందుకే ఈనాడు గెలిచిన,ఎవరిన్ని చేసినా చివరికి న్యాయమే గెలిచిందని,భారత న్యాయవ్యవస్థలో ఈ తీర్పు ఒక చక్కటి వేదికగా నిలిచిందని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ 15ఏండ్ల క్రితమే రమేష్ బాబు దేశ పౌరుడు కాదని నేను చెప్పిందే నిజమైందని,గత 15ఏండ్లుగా నాతో పాటు నడిచి నాకు అండగా నిలిచిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు, నియోజకవర్గ ప్రజలకు, ఆనాటి సిఎం రాజశేఖర్ రెడ్డి, ఈనాటి సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రులు రత్నాకర్ రావు, జీవన్ రెడ్డిలతో పాటు కేంద్ర మంత్రులకు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ మిత్ర బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రమేష్ బాబుది లా మేకర్ చరిత్ర కాదు లా బ్రేకర్ చరిత్రఇంత జరిగినా తీర్పు హేతుబద్ధంగా లేదు నన్ను నిరాశపరిచిందని రమేష్ బాబు అంటున్నాడు, నేను ముమ్మాటికి భారతదేశ పౌరుడిని అని అంటున్నాడు అని అన్నారు. ఇప్పటికీ 45 సార్లు రమేష్ బాబు జర్మనీ పౌరుడని నిరూపించబడింది అని,అయినప్పటికీ ఇంకా ఆయనకు బుకాయింపు ఎందుకో అని ప్రశ్నించారు. రమేష్ బాబు భారతదేశాన్ని మోసం చేస్తున్నారు తప్పితే,జర్మనీ కాదు అని,నేను చేసిన పోరాటం వల్ల 2013లో రమేష్ బాబు భారతదేశ పౌరసత్వం తీసుకున్నాడని ,రమేష్ బాబు ఏనాడు పౌరసత్వం తీసుకున్నాడో ఆనాడే నైతికంగా గెలిచినానని అన్నారు. రమేష్ బాబు జర్మనీని ప్రేమిస్తూ భారతదేశాన్ని నియోజకవర్గ ప్రజలను మోసంచేస్తున్నాడని, 2013 నుండి 2023 వరకు ఆయన ఓసీఐ కార్డు కలిగి ఉన్న మాట నిజంకదా,2019లో మళ్లీ ఒకసారి జర్మనీలోని బెర్లిన్ లో ఓసీఐ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడని అన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే అని చెబుతూ అక్కడ ప్రొఫెసర్ అని చెప్పుకునే వాడు అని,నాలుగు సార్లు గెలిపించిన నియోజకవర్గ ప్రజలను మోసం చేసి అడ్డంగా దొరికిపోయిన దొంగ రమేష్ బాబు అని అన్నారు.రమేష్ బాబు తీరుతో ఆయన వంశానికి, ఆయన తల్లిదండ్రులకు చెడ్డ పేరు తీసుకువచ్చాడని,నేను రోల్ మోడల్ ఛాంపియన్ అని చెప్పుకున్న రమేష్ బాబు చేసింది తప్పని త్రి మెన్ కమిటీ కూడా నిర్ధారించిందని అన్నారు.

రమేష్ బాబు జర్మనీ పౌరుడైనని కేంద్ర హోంశాఖ మూడుసార్లు చెప్పిందిని,అయినప్పటికీ నేను ఎలా బ్రతికేది అంటే నీకు జర్మనీలో పౌరసత్వం ఉన్నది నిజం కదా,15 ఏళ్లుగా తనకు అన్యాయం జరిగిందని కోర్టు చెప్పిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు.తండ్రి చాటు బిడ్డగా నియోజవర్గ ప్రజలను మోసం చేసి గెలిచిన వ్యక్తి రమేష్ బాబు అని,అదే 2009లో కేవలం 1800 ఓట్ల తేడాతో ఓడిపోయిన నేను ఆనాడే గెలిచుంటే,ఈరోజు పరిస్థితి ఎలా ఉండేదో నియోజకవర్గ ప్రజలు ఆలోచన చెయ్యాలని అన్నారు.నేను గెలిచిన, ఓడిన నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని,రమేష్ బాబు స్వార్థం వల్ల నియోజకవర్గ ప్రజలకు ఎంత అన్యాయం జరిగిందో ప్రజలు గమనించాలని అన్నారు. ఈసారి ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాను,ఇప్పటికే 750 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానని,శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుతో కలికోట సూరమ్మ చెరువు, మరిపెల్లి రిజర్వాయర్ పనులు మొదలై కొనసాగుతున్నాయని అన్నారు. ఎన్నో అవమానాలు, అవహేళనలు చేసిన నీవు ఇప్పుడు ఏమి సాధించావు అని ప్రశ్నించారు. నాది మచ్చలేని కుటుంబమని ఎన్నోసార్లు చెప్పావు మరి ఇప్పుడు ఏమంటావు,ఇప్పుడు ఈ సమాజానికి ఏ సమాధానం చెబుతావురమేష్ బాబు అని ప్రశ్నించారు.

ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజం గత పదిహేనేళ్లుగా రమేష్ బాబు పై తాను న్యాయపరంగా పోరాటం చేశానే తప్పితే ఏనాడు వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదని,కానీ రమేష్ బాబు తో పాటు ఆయన అనుచరులు తనను ఎన్నో ఇబ్బందులు పెట్టారు, కేసులో ఇరికించే ప్రయత్నం చేశారు.. తులనాడే మాటలు మాట్లాడింది నిజం కదా,అయినప్పటికీ వారిపై వ్యక్తిగతంగా నాకు ఎలాంటి కోపం లేదు అని అన్నారు. రమేష్ బాబు 1991 లో భారత దేశ పౌరసత్వం రద్దు చేసుకుని మళ్ళీ మూడు 2009లో భారతదేశ పౌరసత్వం పొందారని,2013 సంవత్సరంలో జర్మనీ పాస్పోర్ట్ రెన్యువల్ చేసుకున్నది తప్ప, భారతదేశ పాస్పోర్ట్ ఎందుకు రెన్యువల్ చేసుకోలేదని అన్నారు.

ఓసీఐ కార్డు ఉన్న వ్యక్తి భారతదేశంలో ఓటు వేయడానికి అనర్హుడని,మళ్లీ పది సంవత్సరాలు ఓసి కార్డు పొడిగించమని ఎందుకు అడిగారు అని అన్నారు.తన పరపతి ఉపయోగించి ఓటర్ లిస్టులో పేరు ఎక్కించుకున్నారని, దరఖాస్తు సమయంలో ప్రస్తుత దేశం జర్మనీ అని, పూర్వపు దేశం భారతదేశం అని చెప్పిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు అర్థం చేసుకొని లేనిపోని ఆరోపణలు చేయడం మానేసి నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, ఎన్ని అవంతరాలు ఎదురైన ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన నేను చివరి వరకు ప్రజల క్షేత్రంలోనే ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళు ఎందుకు కృషి చేస్తానని అన్నారు.15 సంవత్సరాలుగా ఆది శ్రీనివాస్ కి అన్యాయం జరిగిందని సాక్షాత్తు కోర్ట్ చెప్పిందని అన్నారు.ఓడిన నేను ప్రజల్లోనే ఉన్నఎమ్మెల్యేగా గెలిచిన సంవత్సరం తర్వాత గెలిచిన రోజే అది కూడా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన రోజు కోర్టు తీర్పు రావడం ఆనందంగా ఉందని అన్నారు.

న్యాయస్థానాల పట్ల ఒక నమ్మకం ఉందని,15 సంవత్సరాలుగా కోర్టులను భారతదేశాన్ని మోసం చేసినందుకు హైకోర్టు 30 లక్షల జరిమానా వేసింద ని,బహుషా ప్రపంచంలో ఇలాంటి కేసు ఎక్కడ ఉండకపోవచ్చు అని అన్నారు.గత 15 ఏండ్ల నా సుదీర్ఘ పోరాటంలో నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన నిందితులను శిక్షించాలి

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని గోరింటాల గ్రామ సమీపంలో శిలాఫలకం ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 30వ తేదీన గోరింటాల గ్రామ సమీపంలో 65 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేసే శిలాఫలకానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేయడం జరిగింది అన్నారు. గిట్టని వ్యక్తులు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనిని ఓర్వలేక ఈ శిలాఫలకాన్ని గురువారం తెల్లవారుజామున ధ్వంసం చ

కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలి

- **కేంద్ర రైల్వే మంత్రితో సీఎం రేవంత్ భేటీ**

బలగం టీవి, హైదరాబాద్

కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కేవలం కాజీపేట వాసుల కల మాత్రమే కాదని, యావత్ తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమని, దాన్ని సాకారం చేయడంలో కేంద్రం ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ఎంపీలతో కలిసి సీఎం అశ్వనీ వైష్ణవ్ ని కలిశారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటును పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. కాజీపేటలో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ (పీఓహెచ్) వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించిందని గుర్తుచేస్తూ ఆ తర్వాత సైతం కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోరుతూ తాను లేఖ రాశానని చెప్పారు.

అలాగే, వికారాబాద్ – కృష్ణా స్టేషన్ మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలు మార్గం నిర్మించాలని, తద్వారా ఇరు ప్రాంతాల మధ్య రావాణాకు 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని చెప్పారు. ఆ మార్గం నిర్మిస్తే దక్షిణ తెలంగాణలో మారుమూల వెనుకబడిన పరిగి, కొడంగల్ తదితర ప్రాంతాలన్నీ సిమెంట్ క్లస్టర్, ఇతర పరిశ్రమలు అభివృద్ధికి అవకాశం ఉంటుందని వివరించారు. కల్వకుర్తి–మాచర్ల మధ్య నూతన రైలు మార్గం మంజూరు చేయాలని సీఎం కోరారు. కల్వకుర్తి నుంచి వంగూరు–కందుకూరు–దేవరకొండ–చలకుర్తి–తిరుమలగిరి మీదుగా మాచర్ల వరకు తాము ప్రతిపాదించే నూతన మార్గం ప్రతిపాదిత గద్వాల–డోర్నకల్, ఇప్పటికే ఉన్న మాచర్ల మార్గాలను అనుసంధానిస్తుందని సీఎం వివరించారు.

డోర్నకల్–మిర్యాలగూడ (పాపటపల్లి–జాన్ పహాడ్), డోర్నకల్–గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పునఃపరిశీలించాలని సీఎంగారు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు మార్గాల అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలని కేంద్ర మంత్రిని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, సురేష్ శేట్కర్, పొరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, కడియం కావ్య, రామసహాయం రఘురామిరెడ్డి, కుందూరు రఘువీర్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, మాజీ ఎంపీ హన్మంతరావు ఉన్నారు.

ముందు రేవంత్ సోదరులనే అరెస్టు చేయాలి : హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్

అల్లు అర్జున్ అరెస్టును అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. అసలు బెన్‌ఫిట్ షోలకు అనుమతి ఇచ్చింది ఎవరు.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా సినిమా ప్రదర్శించింది ఎవరు అని ప్రశ్నించారు. సినిమా కోసం వెళ్లి తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని హరీశ్‌రావు అన్నారు. దీనికి అసలు కారకులు, రాష్ట్ర పాలకులే అని తెలిపారు. చర్యలు తీసుకోవాల్సింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి బ్రదర్స్ వేధింపుల వల్లే చనిపోతున్నా అని సూసైడ్ లెటర్ రాసి సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్య చేసుకుంటే రేవంత్ బ్రదర్స్‌ను ఎందుకు అరెస్టులు చేయరని ప్రశ్నించారు. రేషన్ కార్డు నిబంధనల వల్లే, రుణమాఫీ కాక ఆత్మహత్య చేసుకుంటున్నా అని సూసైడ్ లెటర్ రాసి మేడ్చల్ వ్యవసాయ కార్యాలయం వద్ద సురేందర్ రెడ్డి అనే రైతు ఆత్మహత్య చేసుకుంటే కారకుడైన రేవంత్ రెడ్డిని ఎందుకు అరెస్టు చేయరని నిలదీశారు. అరెస్టు చేయాల్సి వస్తే ముందు రేవంత్ రెడ్డి సోదరులను అరెస్టు చేయాలని అన్నారు. ఏడాది పాలనలో రైతులను బలిగొన్నందుకు ఎవరిని అరెస్టు చేయాలి? ఫుడ్ పాయిజన్లతో 49 మంది విద్యార్థులు చనిపోయారు. దీనికి ఎవరిని అరెస్టు చేయాలి? ఫార్మా సిటీ పేరుతో లగచర్ల గిరిజన బతుకులను ఛిద్రం చేశారు. దీనికి ఎవరిని అరెస్టు చేయాలి అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

బతుకమ్మను అవమానించిన మంత్రులపై చర్యలు తీసుకోండి..

(మొదటి పేజీ తరువాయి)

సోనియా, రాహుల్ కూడా బతుకమ్మ ఎందుకు ఆడారని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించామని చెప్పారు. జీవో కూడా విడుదల చేశామని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి రూపాన్ని ఎలా మారుస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమంలో స్ఫూర్తి నింపిన రూపాన్ని విగ్రహంగా మలుచుకున్నామని చెప్పారు. తెలంగాణ తల్లిపై రేవంత్ రెడ్డి సర్కార్ గెజిట్ ఇవ్వడం దారణమన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం కూడా భరతమాత విగ్రహంపై గెజిట్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి విగ్రహాలు పెట్టుకున్నామని అన్నారు. జీవో ఇస్తేనే వారి విగ్రహాలు పెడతామా అని ప్రశ్నించారు. ప్రజలను అవమానించేలా తెలంగాణ తల్లి జీవో ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రయోజనాలే ముఖ్యమని, ప్రజలు కాదన్నారు. ఆ పార్టీది తెలంగాణ వాదం కాదని, కాంగ్రెస్ వాదమని విమర్శించారు. కాంగ్రెస్ వాళ్లకు ఓట్లు ఉన్నప్పుడే తెలంగాణ ప్రజలు గుర్తుకు వస్తారని ధ్వజమెత్తారు.ఎన్ని కేసులు పెట్టినా ఊరూరా తెలంగాణ తల్లిని నిలుపుకుంటామన్నారు. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

'పుష్ప అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

అల్లు అర్జున్ రావటం వల్లే ఒకరు చనిపోయారని, దీనికి కారణం అల్లు అర్జున్ అంటూ పోలీసుల తరపున వాదనలు వినిపించారు లాయర్లు. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం అల్లు అర్జున్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పిచ్చింది. ఇదిలావుండగా తనపై నమోదైన కేసు కొట్టివేయాలంటూ హైకోర్టును అల్లు అర్జున్ ఆశ్రయించారు. లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేసింది. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి చివరకు బెయిల్ మంజూరు చేశారు. అయితే బెయిల్ వచ్చే సమయానికి చంచల్‌గూడ జైలుకు అల్లు అర్జున్ ఎంటర్ అయ్యారు. ఆయన తరుపున లాయర్లు వచ్చి జైలు అధికారులకు కోర్టు ఉత్తర్వులు అందజేసిన అనంతరం రాత్రి అల్లు అర్జున్ విడుదలయ్యారు.

అల్లు అర్జున్ థియేటర్‌కు రావడం వల్లే అక్కడ తొక్కిసలాట జరిగిందని నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ నెల 4న సంధ్య థియేటర్‌లో పుష్ప 2 ప్రిమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై ఆయన స్పందించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు.

అరెస్టుపై మృతురాలి భర్త భాస్కర్ మాట్లాడారు. ఆ రోజు తన కుమారుడు శ్రీ తేజ పుష్ప సినిమా చూడాలని పంతం చేయడంతో సంధ్య థియేటర్‌లో సినిమా చూడటానికి కుటుంబ సభ్యులం కలిసి వెళ్లామని తెలిపారు. అల్లు అర్జున్ రావడంలో ఆయన తప్పేం లేదని.. తన భార్య మతికి అల్లు అర్జున్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. అల్లు అర్జున్ అరెస్ట్ విషయం కూడా ప్రసార మాధ్యమాల్లో చూసానని పోలీసులు తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. కేసు కూడా వాపసు తీసుకుంటానన్నారు.

మహా కుంభమేళాలో తొలిసారి ఏఐ, చాట్‌బాట్ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

మహా యజ్ఞంగా నిర్వహిస్తామన్న ప్రధాని.. భారత్ అంటేనే పవిత్ర స్థలాలకు పుట్టినిల్లుగా అభివర్ణించారు. మహా కుంభమేళాకు ఏర్పాట్లు చేస్తున్న కార్మికులను, అధికారులను ప్రధాని అభినందిస్తూ ఈ ప్రయాగ్‌రాజ్ భూమిపై కొత్త చరిత్ర సృష్టించబోతోందన్నారు. కాగా, మహా కుంభ మేళాకి వచ్చే భక్తుల సంఖ్యను లెక్కించేందుకు ఉత్సవ నిర్వాహకులు ఏఐ కెమెరాలతో పాటు.. ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించనున్నారు. ఈసారి మహా కుంభమేళాలో సుమారు 45 కోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కుంభ మేళాకు వచ్చే భక్తుల సంఖ్యను గుర్తించేందుకు 200 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

సరస్వతీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి దిశానిర్దేశం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లకు సంబంధించిన అంచనాలను తయారు చేసి నివేదిక అందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రస్తుతం ఉన్నవారితో పాటు పుష్కరాలు జరిగే కాలపరిమితికి స్పెషల్ గా కొంతమందిని నియమించాలని స్థానిక కలెక్టర్, ఈఓని ఆదేశించారు. గ్రామీణ మంచినీటి శాఖ ద్వారా పట్టణంలోని ప్రధాన కూడళ్లు, గోదావరి, దేవాలయ పరిసర ప్రాంతాల్లో సురక్షిత మంచినీరు ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక, శాశ్వత మరుగుదొడ్లు నిర్మించాలని తెలిపారు. భక్తులు స్నానాల కోసం నల్లాలు, మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా కాళేశ్వరంలో అంతర్గత రోడ్లు తాత్కాలిక రోడ్లు నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. 12 రోజుల పాటు ప్రతి రోజూ ఒక్కో రకమైన సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలని రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలను తొలగించాలని ఆదేశించారు. ఆర్టీసీ ద్వారా వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక వైద్య కేంద్రాలు పెట్టాలని, అత్యవసర వైద్య సేవలకు మహాదేవ పూర్, కాటారంలలో ప్రత్యేక రూములు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు నిబద్ధతతో పనిచేసి 12 రోజుల పాటు జరిగే పుష్కరాలను విజయవంతం చేయాలని అన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరంలో అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పనుల విషయంలో ఎటువంటి ఇబ్బందులున్నా తనను సంప్రదించాలని, భక్తులకు మాత్రం ఎటువంటి ఆటంకం కలగ వద్దని మంత్రి సురేఖ ప్రత్యేకంగా చెప్పారు. ఈ రివ్యూ సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఎండి ప్రకాష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్, దేవాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణా రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, అసిస్టెంట్ కమిషనర్ సునీత, కన్సర్వేషన్ ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, కాళేశ్వరం ఆలయ ఈవో మారుతీ తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కులను సౌకర్యాలతో తీర్చిదిద్దాలి

- **మంత్రి సురేఖ**
- **అటవీ అధికారులతో కలిసి యానిమల్ అడాప్షన్ స్కీమ్ బ్రోచర్, డైరీ, కాఫీ టేబుల్ బుక్ ను ఆవిష్కరించిన మంత్రి**

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కులను మెరుగైర సౌకర్యాలతో తీర్చిదిద్ది, పర్యావరణహిత కార్యక్రమాలతో సందర్శకులను ఆకట్టుకునేలా కార్యాచరణను అమలుచేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అటవీశాఖను ఆదేశించారు. ఈ రోజు డా.బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శ్రీమతి కొండా సురేఖ గారి ఆధ్వర్యంలో జూస్ అండ్ పార్క్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ 13వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అటవీ అధికారులతో కలిసి యానిమల్ అడాప్షన్ స్కీమ్ బ్రోచర్, డైరీ, కాఫీ టేబుల్ బుక్ ను మంత్రి సురేఖ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్ (హెచ్ఓఎఫ్ ఎఫ్), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్ మేరు, సిసిఎఫ్ లు ప్రియాంక వర్గీస్, భీమా నాయక్, రామలింగం, డైరక్టర్ జూ పార్క్స్ సునీల్ ఎస్. హేరామత్, పశుసంవర్ధకశాఖ జెడి కృష్ణమూర్తి, పలువురు డిఎఫ్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, సందర్శకుల అభిరుచుల మేరకు, పర్యావరణానికి ఏమాత్రం ఇబ్బంది కలగకుండా, అటవీశాఖకు ఆదాయం సమకూరే విధంగా పకడ్బందీ ప్రణాళికలతో జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పనిచేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రపంచవ్యాప్తంగా జూ పార్కుల్లో అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, ఉత్తమ విధానాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తొమ్మిది జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను అధికారులకు మంత్రి సురేఖకు వివరించారు.

రాష్ట్రంలోని నెహ్రూ జూ పార్క్, కాకతీయ జూ పార్క్, పిల్లలమర్రి మినీ జూపార్క్, లోయర్ మానేరు డీర్ పార్క్, కిన్నెరసాని డీర్ పార్క్ జంతు సంరక్షణ చర్యలు, కేబీఆర్, మృగవని, మహవీర్ హరిణ వనస్థలి, ఇతర అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సందర్శకుల సంఖ్య పెరిగే విధంగా అమలుచేయాల్సిన అదనపు సౌకర్యాలు పై మంత్రి సురేఖ అధికారులకు పలు సూచనలు చేశారు. జంతువుల దత్తత పై అనుసరిస్తున్న విధివిధానాల పై మంత్రి సురేఖ ఆరా తీశారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన నిమిత్తం ఆన్లైన్ లో టికెట్ బుకింగ్, ఇంటిగ్రేటెడ్ ఫాస్ట్ ట్రాక్ పార్కింగ్ వంటి ఎన్నో సదుపాయాలను కల్పిస్తున్నట్లు జూ పార్క్స్ డైరక్టర్ సునీల్ ఎస్. హేరామత్ మంత్రి సురేఖ గారికి వివరించారు. వృద్ధులు, చిన్నపిల్లల సౌకర్యాల నిమిత్తం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఆయా జూ పార్కుల్లోని జంతు సంపద, వాటి సంరక్షణకు అనుసరిస్తున్న విధానాలు, సిబ్బంది అందుతున్న సౌకర్యాల పై మంత్రి సురేఖ ఆరా తీశారు. జూ పార్కుల మధ్య పరస్పరం జంతువుల మార్పిడి, జూ పార్కులకు ఆదాయం పెరగడానికి అవలంబించాల్సిన కార్యాచరణ పై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ పార్కుల్లో పనిచేసే సిబ్బందికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించాల్సిన అవసరాన్ని మంత్రి అధికారులకు నొక్కి చెప్పారు.

రేవంత్ రెడ్డిని కూడా జైల్లో పెట్టాలి

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

బలగం టీవి, హైదరాబాద్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. జాతీయ పురస్కారం అందుకున్న స్టార్‌ను అరెస్టు చేయడం పాలకుల అభద్రతాభావానికి ఇది పరాకాష్ట అని విమర్శించారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట బాధితులకు పూర్తిగా సానుభూతి తెలుపుతాను.. కానీ ఘటనలో నిజంగా తప్పు చేసింది ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు. ఘటనకు నేరుగా బాధ్యుడు కానీ అల్లు అర్జున్‌ను సాధారణ నేరగాడిలా ట్రీట్ చేయడం సరికాదని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ తీవ్ర చర్యను ఖండిస్తున్నానని తెలిపారు. హైడ్రా కూల్చివేతలతో ఇద్దరి చావుకు బాధ్యుడైన రేవంత్ రెడ్డిని కూడా ఇదే లాజిక్‌తో అరెస్టు చేయాలని సూచించారు.

నేటి నుంచి గబ్బా సవాల్

- భారత్-ఆస్ట్రేలియా మూడో టెస్టుకు సర్వం సిద్ధం

బలగం టీవి, బ్రిస్బేన్

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఇండియా ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్ట్ శనివారం నుంచి గబ్బా వేదికగా మొదలుకాబోతుంది. ఈ మూడో టెస్ట్‌కు గబ్బా స్టేడియం ఆతిథ్యం ఇవ్వబోతున్నది. తొలి టెస్ట్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన టీమిండియా రెండో టెస్ట్‌లో మాత్రం తేలిపోయింది. ఇక గబ్బా స్టేడియం టీమిండియాకు అంతగా అచ్చి రాలేదు. ఈ పిచ్‌పై భారత జట్టు ఇప్పటివరకు ఏడు టెస్ట్ మ్యాచులు ఆడగా కేవలం ఒక్కదాంట్లోనే విజయం సాధించింది

ఇక ఒకరకంగా సిరీస్ డిసైడర్‌గా మారిన ఈ మ్యాచ్‌తో రెండు టీమ్స్ ఫేట్ ఏంటో తేలిపోనుంది. 1-1తో సమంగా ఉన్నాయి. కాబట్టి ఇందులో గెలిచిన టీమ్.. ట్రోఫీని ఎగరేసుకుపోయే అవకాశాలు బలంగా ఉంటాయి. ఓడిన జట్టు కమ్‌బ్యాక్ ఇవ్వడం క్లిష్టతరంగా మారుతుంది. ఆల్రెడీ అడిలైడ్‌లో ఓడిన భారత్.. మళ్లీ మ్యాచ్‌ను చేజార్చుకుంటే డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ కూడా గల్లంతు అవుతుంది. అందుకే ఎలాగైనా నెగ్గాలనే కసితో ఆడనుంది భారత్. అందుకోసం జట్టులో పలు కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

గబ్బా టెస్ట్‌కు ఆల్రెడీ తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను ప్రకటించింది ఆస్ట్రేలియా. జట్టులో ఒక్క మార్పు మాత్రమే చేసింది. పేసర్ బోలాండ్ ప్లేస్‌లో సీనియర్ స్పీడ్‌స్టర్ జోష్ హేజల్‌వుడ్‌ను తీసుకుంది. భారత్ తుది జట్టును ఇంకా ప్రకటించలేదు. కానీ టీమ్‌లో పలు కీలక మార్పులు చేసుకోవడం ఖాయమని తెలుస్తోంది. ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కెప్టెన్ రోహిత్ శర్మ దిగుతారు. నెట్స్‌లో కొత్త బంతితో చాలా సేపు ప్రాక్టీస్ చేసిన హిట్‌మ్యాన్.. రాహుల్‌ను మిడిలార్డర్‌లో ఆడించి, తాను ఇన్నింగ్స్ స్టార్ట్ చేస్తానని ఇప్పటికే హింట్ ఇచ్చేశాడు.

ఫస్ట్ డౌన్‌లో శుబ్‌మన్ గిల్, సెకండ్ డౌన్‌లో టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆడటం ఖాయం. ఆ తర్వాత కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ బ్యాటింగ్‌కు దిగుతారు. మొదట్రెండు మ్యాచుల్లో అదరగొట్టిన తెలుగుతేజం నితీష్ కుమార్ రెడ్డిని బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ ఇచ్చి కాస్త పైకి పంపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. రవిచంద్రన్ అశ్విన్ స్థానంలో పెర్త్ టెస్ట్‌లో రాణించిన స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఆడటం పక్కాగా కనిపిస్తోంది. ఒకవేళ సుందర్ వద్దనుకుంటే మరో స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను టీమ్‌లోకి తీసుకోవచ్చు. పేస్ బాధ్యతల్ని జస్‌ప్రీత్ బుమ్రాతో కలసి మహ్మద్ సిరాజ్ పంచుకుంటాడు. రెండో టెస్ట్‌లో విఫలమైన హర్షిత్ రాణా స్థానంలో ఆకాశ్‌దీప్‌ను ఆడించే అవకాశాలు బలంగా ఉన్నాయి.

భారత కాలమాన ప్రకారం మ్యాచ్ ఉదయం 5:50 నిమిషాలకు ప్రారంభమవుతుంది. 7:50 నిమిషాల వరకు ఈ సెషన్ ఉంటుంది. ఆ తర్వాత ఇరు జట్ల ఆటగాళ్లు 40 నిమిషాల పాటు లంచ్ విరామానికి వెళ్తారు. తిరిగి 8:30 నిమిషాలకు రెండో సెషన్ ప్రారంభమవుతుంది. 10:50 నిమిషాల వరకు ఈ సెషన్ ఉంటుంది. రెండు సెషన్ ల తర్వాత టీ విరామం 20 నిమిషాల పాటు ఉంటుంది. చివరి సెషన్ 10:50 నిమిషాల నుంచి 1:20 నిమిషాల వరకు ఉంటుంది.

గబ్బా టెస్ట్‌కు ఆస్ట్రేలియా జట్టు ఇదే..

బలగం టీవి, బ్రిస్బేన్

బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా భారత్ ఆస్ట్రేలియా మధ్య శనివారం మూడో టెస్ట్ జరుగనున్నది. బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా జరిగే మ్యాచ్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. రెండు టెస్ట్‌లకు గాయం కారణంగా దూరమైన జోష్ హేజిల్‌వుడ్ మళ్లీ తిరిగి జట్టులోకి వచ్చాడు. హేజిల్‌వుడ్‌ను జట్టులోకి తీసుకోవడంతో స్కాట్ బోలాండ్‌ను పక్కన పెట్టింది. అడిలైడ్ డే-నైట్ టెస్టులో హేజిల్‌వుడ్ స్థానంలో బోలాండ్‌కు తుది జట్టులో స్థానం కల్పించిన విషయం తెలిసిందే.కెప్టెన్ పాట్ కమిన్స్ మాట్లాడుతూ బోలాండ్ అడిలైడ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడని గుర్తు చేశారు. గబ్బా టెస్ట్‌కు ఉస్మాన్ ఖవాజా, నాథన్ మెక్‌స్వీనీ, మార్నస్ లాబుషాగ్నే, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), పాట్ కమిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, జోష్ హేజిల్‌వుడ్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా ఎంపిక చేసింది. దురదృష్టవశాత్తు అతను గత 18 నెలల్లో బెంచ్‌పైనే ఎక్కువ సమయం గడిపాడని పేర్కొన్నారు. తుదిజట్టులో స్థానం దొరిగినప్పుడల్లా రాణించాడన్నాడు. ఎంసీజీలో నాల్గో టెస్ట్‌కు అతను ఆడే అవకాశం ఉందని చెప్పాడు. శనివారం ప్రారంభమయ్యే టెస్ట్ సందర్భంగా క్యూరేటర్ డేవిడ్ సాండూర్‌స్కీ మాట్లాడుతూ మ్యాచ్ కోసం భిన్నమైన పిచ్‌ను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. సాధారణంగా సీజన్ ప్రారంభంలో పిచ్‌లు కొంచెం కొత్తగా ఉంటాయని.. అదే సమయంలో ఎక్కువ వేగం, బౌన్స్ కలిగి ఉంటాయన్నారు. సాధారణంగా ప్రతిసారీ ఇలాంటి పిచ్‌నే సిద్ధం చేస్తామన్నారు. ఇక్కడి పిచ్‌పై వేగంతో పాటు బౌన్స్‌ను రాబట్టవచ్చని పేర్కొన్నారు.

గుకేశ్‌పై లిరెన్ కావాలనే ఓడిపోయాడు

- రష్యా ఫెడరేషన్ సంచలన ఆరోపణలు

బలగం టీవి, న్యూఢిల్లీ

చెస్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ ను భారత్ యంగ్ చెస్ ప్లేయర్ గుకేశ్ గెలిచిన సంగతి తెలిసిందే. గురువారం జరిగిన ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. అయితే ఆఖరిదైన 14వ రౌండ్‌లో లిరెన్ చేసిన ఓ ఘోర తప్పిదాన్ని గుకేశ్ ఉపయోగించుకున్నాడు. అయితే, ఈ ఫలితం విషయంలో రష్యా చెస్ ఫెడరేషన్ తాజాగా సంచలన ఆరోపణలు చేసింది. చైనా దిగ్గజం లిరెన్ కావాలనే ఓడిపోయాడంటూ ఆరోపించింది.

"ఈ మ్యాచ్ రిజల్ట్ చెస్ అభిమానులు, నిపుణులను నివ్వెరపర్చింది. ఎంతో ఉత్కంఠంగా జరిగిన పోరులో చైనీస్ ఆటగాడి చర్యలు చాలా అనుమానాస్పదంగా అనిపిస్తున్నాయి. లిరెన్ ఉన్న స్థితిలో అతడు ఓడిపోవడం అసంభవం. కానీ, అతడు చేసిన తప్పిదం పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఉద్దేశపూర్వకంగానే చేశాడేమో అని నాకు అనిపిస్తోంది. దీనిపై అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ (ఫిడే) ప్రత్యేకంగా విచారణ జరపాల్సి ఉంది" అని రష్యా చెస్ ఫెడరేషన్ చీఫ్ అంద్రీ ఫిలటోవ్ డిమాండ్ చేశారు.

సుమారు నాలుగు గంటలకు పైగా సాగిన ఆఖరి గేమ్ 58 ఎత్తుల్లో ముగిసింది. అయితే 55వ ఎత్తులో లిరెన్ ఏనుగును కదపడం గుకేశ్‌కు కలిసొచ్చింది. ఆ అవకాశాన్ని అతడు ఉపయోగించుకున్నాడు. దీంతో వెంటనే ఆ ఏనుగును ఉపయోగించి ఏనుగుతో గుకేశ్ చంపేశాడు. లిరిన్ తప్పిదం తర్వాత ఆట ఎంతోసేపు సాగలేదు. చైనా గ్రాండ్‌మాస్టర్ ఓటమిని అంగీకరించక తప్పలేదు. దీంతో 7.5-6.5 పాయింట్లతో గుకేశ్ విశ్వవిజేతగా నిలిచాడు.

'డాకు మహారాజ్' మొదటి సాంగ్ ప్రోమో

బలగం టీవి, హైదరాబాద్

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి రూపొందిస్తున్న చిత్రం 'డాకు మహారాజ్'. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ విజువల్స్ అంచనాలు పెంచాయి. ఈ నేపథ్యంలో డాకు మహారాజ్ ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్ చేశారు మేకర్స్. డేగ డేగా అంటూ సాగే ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా.. నకాష్ అజీజ్ పాడారు. 'మాస్ విధ్వంసం సృష్టించేలా.. సౌండ్ వరల్డ్ ఆఫ్ డాకు' అనేలా సాంగ్ బ్లాస్ట్ అయ్యే లక్షణాలు క్లియర్‌గా కనిపిస్తున్నాయి. తమన్ ఇచ్చిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, ట్యూన్ గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. ఈ మూవీలో 'యానిమల్'తో మెప్పించిన బాబీడియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. బాలకృష్ణకు జోడిగా అందాల భామ శ్రద్ధా శ్రీనాథ్ కనిపించనున్నారు. 'వాల్తేరు వీరయ్య'తో పాటు పలు సినిమాలలో స్పెషల్ సాంగ్స్ చేసిన ఊర్వశీ రౌతేలా మరో స్పెషల్ రోల్ చేయనున్నారు. ఇకపోతే డాకు మహారాజ్ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా 2025 జనవరి 12న థియేటర్స్‌లోకి రాబోతోంది. తమన్ సంగీతం అందిస్తున్నాడు.



సంక్రాంతికి వస్తున్నాం నుంచి మీను పాట ప్రోమో

బలగం టీవి, హైదరాబాద్

నటుడు వెంకటేశ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన తాజా చిత్రం సంక్రాంతికి వస్తున్నాం నుంచి మీను సాంగ్ ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. మీనాక్షి చౌదరి గురించి ఈ పాట ఉండబోతున్నట్టు ప్రోమో చెబుతోంది. సాంగ్‌లో వెంకీ పోలీసాఫీసర్‌గా సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తూ ఘర్షణ సినిమాను మరోసారి గుర్తుకు తెచ్చారు. త్వరలో పూర్తి లిరికల్ సాంగ్‌ను విడుదల చేయనున్నారు. ఇప్పటికే గోదారి గట్టు మీద రామసిలకవే.. అంటూ సాగే ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. భాస్కర భట్ల రాసిన ఈ పాటను రమణ గోగుల, మధుప్రియ పాడగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు. ఈ మూవీ 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.

ఓటీటీలోకి 'మెకానిక్ రాకీ'

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన చిత్రం 'మెకానిక్ రాకీ'. థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఫలితం అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులో ఉంది. ఈ విషయాన్ని తాజాగా ఆ సంస్థ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది.

అల్లు అర్జున్ అరెస్ట్‌పై స్పందించిన వరుణ్ ధావన్

బలగం టీవి, హైదరాబాద్



అల్లుఅర్జున్ అరెస్ట్‌పైబాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ స్పందించారు. జైపూర్‌లో జరిగిన ఈవెంట్‌లో వరుణ్ ధావన్ మాట్లాడుతూ జరిగిన ఘటన చాలా దురదృష్టకరని చెప్పారు. కానీ ఈ ఘటనకు ఒక్కళ్లనే బాధ్యులను చేయటం సరికాదన్నారు. నటుడు ఒక్కరే అన్ని విషయాలు చూసుకోలేరని అభిప్రాయపడ్డారు.